‘ఉపాధి’లో అక్రమాలకు చెక్

- ఎన్‌ఎంఎంఎస్‌తో పారదర్శక హాజరు
- సత్ఫలితాలిస్తున్న నూతన సాఫ్ట్‌వేర్
- ఊపందుకున్న ఉపాధి హామీ పనులు


కైకలూరులో పనులు పర్యవేక్షిస్తున్న సిబ్బంది

కైకలూరు: జాబ్ కార్డు కలిగిన కూలీ ఉపాధి పనులు చేయకపోయినా వేతనం పొందేవారనే విమర్శలున్నాయి. కొన్ని చోట్ల గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు చెందిన కుటుంబ సభ్యులు పనులకు రాకపోయినా మస్టర్ నమోదు చేసేవారు. ప్రభుత్వ ధనం ఈ విధంగా పక్కదారి పట్టేది. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీల హాజరు విషయంపై కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ హాజరును తీసుకొచ్చింది. ఈ విధానం సత్ఫలితాలనిస్తోంది.

రూ.27.72 కోట్లు జమ

కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి 43,527 కుటుంబాలకు 76,678 జాబ్‌కార్డులున్నాయి. ఇప్పటి వరకు 11,13,508 పని దినాలకు సంబంధించి మొత్తం రూ.27,72,63,492 నగదును ఉపాధి కూలీలకు చెల్లించారు. ఆధార్ కార్డుల అనుసంధానం విషయానికి వస్తే మొత్తం నియోజకవర్గంలో మొత్తం 76,720 ఆధార్‌కార్డుదారులకు 75,953 ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగిలిన 767 నమోదు చేయాల్సి ఉంది. నియోజకవర్గంలో ఎక్కువగా జాబ్ కార్డుదారులు ముదినేపల్లి మండలంలో 22,648 మంది ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌తో ఆన్‌లైన్‌లో నమోదు

కేంద్ర ప్రభుత్వం నేషనల్ మస్టర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను(ఎన్‌ఎంఎంఎస్) ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి అమలు చేస్తోంది. నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్(ఎన్‌ఐసీ) టెక్నాలజీ ద్వారా ఇది పనిచేస్తోంది. ప్రారంభంలో మ్యాన్యువల్ మస్టర్ ద్వారా హాజరు వేసేవారు. గతంలో ఎన్‌ఎంఎంఎస్ ద్వారా 20 మంది కంటే ఎక్కువ మంది కూలీలు హాజరైతేనే ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. సంఖ్య తగ్గితే ఇది పనిచేయదు. ప్రస్తుతం ఎన్‌ఎంఎంఎస్ విధానం ద్వారా సంఖ్యతో పనిలేకుండా ఒక కూలీ ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లోనే నమోదు చేయవచ్చు. రెండు సార్లు పని ప్రదేశంలో ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

అక్రమాలకు అడ్డుకట్టు

ఉపాధి హామీ పథకం ప్రారంభంలో కూలీల మస్టర్ల విషయానికి వస్తే ఎన్నో ఆరోపణలు వచ్చాయి. సోషల్ ఆడిట్ జరిగినప్పుడు ప్రతి చోట కూలీల హాజరు విషయంలోనే సమస్య ఎదురయ్యేది. ఫీల్డ్ అసిస్టెంట్లు కొంత మంది తమ కుటుంబ సభ్యులు పనులకు రాకపోయినప్పటికీ మస్టర్లు వేసి హాజరైనట్లు చూపించి అక్రమాలకు పాల్పడిన ఆరోపణలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతం ఈఎంఎస్ఎస్ విధానం అమలులోకి రావడంతో ఈ అక్రమాలకు చెక్ పడింది.

నియోజకవర్గంలో ఉపాధి హామీ అమలు ఇలా..

మండలం	కుటుంబాలు	జాబ్ కార్డులు	పని రోజులు	చెల్లించిన మొత్తం
కైకలూరు	11,117	19,282	2,23,511	రూ.5,56,54,239
కలిదిండి	9,831	16,811	2,51,365	రూ.6,25,89,885
మండవల్లి	9,927	17,937	2,23,409	రూ.5,56,28,841
ముదినేపల్లి	12,652	22,648	4,15,223	రూ.10,33,90,527
మొత్తం:	43,527	76,678	11,13,508	రూ.27,72,63,492

98 శాతం ఆధార్ ఆన్‌లైన్ పూర్తి

జాబ్ కార్డులను ఆధార్ కార్డుకు అనుసంధానించే ప్రక్రియ 98 శాతం పూర్తయ్యింది. నూతన ఎన్‌ఎంఎంఎస్ విధానం ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి అమలవుతోంది. నేరుగా కూలీ అకౌంట్‌కు నగదు చెల్లించడమే కాకుండా పూర్తి పారదర్శకంగా హాజరు నమోదవుతుంది. పని ప్రదేశం వద్దే రెండు ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం.

– ఏ.శరత్‌కుమార్,
ఉపాధి హామీ, ఏబీఓ, కైకలూరు.

క్లుప్తంగా

కానుకొల్లులో ముమ్మరంగా పైప్‌లైన్ పనులు



మండవల్లి: మండలంలోని కానుకొల్లులో సర్పంచ్ నాగదాసి థామస్ ఆధ్వర్యంలో బుధవారం పైప్‌లైన్ల ఆధునీకరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు పైప్‌లైన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే ప్రజలకు మంచి నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



మండవల్లి: మండలంలోని శింగనపూడిలో ఉపాధి హామీ పథకం నిధులతో పంట కాలువ తవ్వకం పనులు బుధవారం చేపట్టారు. ఎంటీఏ నవీన్ మాట్లాడుతూ రూ.1.50 లక్షల నిధులతో పంట కాలువ తవ్వకం పనులు నిర్వహిస్తున్నామన్నారు. 56 మంది కూలీలు పనులు చేశారని చెప్పారు. ఉపాధి పనుల ద్వారా రైతుల పంట కాలువలు అభివృద్ధి చెంది సాగు నీటి సమస్యలు పరిష్కారమతున్నాయన్నారు. చెరువులను అభివృద్ధి చేయడం ద్వారా పశువులకు తాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

మండవల్లి: వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో నష్టపోతున్నారని ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు తెలిపారు. మండవల్లి మండలం తక్కెళ్లపాడులో ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కులపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాచార హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 17 ఏళ్లయినా గ్రామీణ ప్రజలకు అవగాహన లేదని చెప్పారు. కార్యక్రమంలో ఐక్య వేదిక సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



గుడివాడటౌన్: వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులు బుధవారం పట్టణంలో మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకులు కొయిలాపు రాము బాటసారులకు మజ్జిగ, ఆటో డ్రైవర్‌లకు టవల్స్ పంపిణీ చేశారు. పల్లెబాట రాజా తదితరులు పాల్గొన్నారు.

బాలామృతం అందజేత



మండవల్లి: మండవల్లి అంగన్‌వాడీ సెంటర్-1లో సర్పంచ్ మెండా ఝాన్సీ చేతుల మీదుగా పిల్లలకు బాలామృతం ప్యాకెట్లు, కోడిగుడ్లు అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, వార్డు సభ్యుడు, అంగన్‌వాడీ కార్యకర్త, వలంటీర్లు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

స్వల్ప కాల శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

గుడివాడటౌన్: స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ఇనిషియేటివ్ నందు ప్రధానమంత్రి వికాస యోజన స్కీమ్ ద్వారా స్వల్పకాలిక శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేజీకే చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాస్ ఆపైన చదివిన వారికి అసిస్టెంట్ టెక్నీషియన్, ఎయిర్ కండీషన్, సోలార్ ప్యానల్ ఇన్‌స్టలేషన్ టెక్నీషియన్స్, మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్, ఎలక్ట్రిషియన్, డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో ఈనెల 27వ తేదీ కళాశాల కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి


కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్, సురేష్‌రెడ్డి తదితరులు

కురుమద్దాలి(పామర్రు): రానున్న కాలంలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా అందరం కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామంలో కొత్తగా నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అన్ని వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ వారికి ప్రభుత్వంపై విశ్వాసాన్ని కల్పించాలని అన్నారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలతో కూడిన కిట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీ వెంకటేశ్వరమ్మ, శ్రీనివాసరావు, సర్పంచ్ జి.విజయభారతి, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం గురజాడ గ్రామంలో వైఎస్సార్ సీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గృహ సారథులు, వలంటీర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. పమిడిముక్కల మండల సచివాలయ కన్వీనర్ పరసా జగన్ మోహన్ రావు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, సర్పంచ్ జంపాన వెంకటేశ్వరరావు(చంటి), సచివాలయ కన్వీనర్లు పైడిగోలపు మోజేష్, రజియా బేగం, మధు శివరాం ప్రసాద్, గృహసారథులు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్న విజయవంతం చేయాలి

తోట్లవల్లూరు: ఈ నెల 18 నుండి 26 వరకు జరగనున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం విజయవంతానికి గృహసారథులు, వలంటీర్లు కృషి చేయాలని మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర పిలుపునిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో తోట్లవల్లూరు గ్రామ గృహ సారథుల సమావేశం జరిగింది. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, మండల పార్టీ కన్వీనర్ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోర్ల రామచంద్రరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు డొక్కు వీరలక్ష్మి, నాయకులు పీఎస్ కోటేశ్వరరావు, దేవరపల్లి చంద్రశేఖర్, కిలారం రామకృష్ణ పాల్గొన్నారు.

ఈ-క్రాప్‌లో అభ్యంతరాలు తెలపండి


మాట్లాడుతున్న ఏడీఏ గంగాధరరావు

కైకలూరు: రైతులు ఈ - క్రాప్ నమోదులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా వ్యవసాయాధికారులకు తెలియజేయాలని కైకలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు గంగాధరరావు చెప్పారు. వింజరం రైతు భరోసా కేంద్రం వద్ద గ్రామసభను బుధవారం నిర్వహించారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కైకలూరు మండలంలో 1,409 మంది రైతులకు చెందిన 2,430 ఎకరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేశామన్నారు. ముసాయిదా జాబితాను ఆయా ఆర్బీకే కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నామన్నారు. రైతులు జాబితాలో మార్పులు, చేర్పుల అభ్యంతరాలను తెలియజేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి ఆర్.దివ్య, వీఏఏ జె.కనకదుర్గ, రైతులు హాజరయ్యారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


పామర్రులో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థినులు

పామర్రు: పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలి రోజైన బుధవారం ప్రశాంతంగా జరిగాయి. తెలుగు, సంస్కృతం పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ డి.సుధాకరరావు మాట్లాడుతూ కేంద్రంలో 174 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా వీరిలో ఆరుగురు గైర్హజరయ్యారన్నారు. విద్యార్థులకు తాగునీరు, గదులలో విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటు చేశామని అన్నారు. నిమ్మకూరు గ్రామంలోని ఏపీ గురుకుల కళాశాలలో పరీక్షలు నిర్వహించారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు..

మొవ్వ: మొవ్వ గ్రామంలోని క్షేత్రయ్య జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో బుధవారం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభమైయ్యాయి. తొలి రోజు జనరల్ విభాగం నుంచి 133 మంది, వృత్తి విద్యా విభాగం నుంచి 62 మంది హాజరవ్వాల్సి ఉండగా జనరల్ విభాగంలో నలుగురు, వృత్తి విద్యా విభాగంలో ఒకరు గైర్హాజరైయ్యారు. కళాశాల గణిత అధ్యాపకుడు కె.కిరణ్ కుమార్ ముఖ్య పర్యవేక్షకులుగా వ్యవహరించగా మచిలీపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఎల్ హిరణ్మయి డిపార్ట్‌మెంటల్ అధికారిగా వ్యవహరించారు.

గుడివాడలో ప్రశాంతంగా పరీక్షలు

గుడివాడటౌన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు పట్టణంలో ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ఏఎన్నార్, కేటీఆర్, శ్రీవిద్య, శ్రీచైతన్య, నారాయణ కళాశాలలతో పాటు నందివాడ మండలం రుద్రపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ పరీక్షలు జరిగాయి. ఆరు పరీక్షా కేంద్రాలలో మొత్తం 1,655 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావలసి ఉండగా 1618 మంది హాజరయ్యారని 37 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు.

కైకలూరులో..

కైకలూరు: నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. కైకలూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, దత్తత్రేయ కో-ఆపరేటీవ్ జూనియర్ కాలేజీలు, ముదినేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ, కలిదిండి, కోరుకొల్లులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కలిపి మొత్తం 5 సెంటర్లలో ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు ఫస్టియర్ విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ లాంగ్వేజీ పరీక్షలు రాశారు. నియోజకవర్గంలో మొదటి రోజు 883 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 795 మంది పరీక్షలు రాశారు. మొత్తం మీద 88 మంది హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. జిరాక్స్ దుకాణాలను మూయించి వేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువెళ్లకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు.


మొవ్వలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వైద్య సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నారు. ఆయా సెంటర్ల సమీపంలో విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షలు ముగిసేవరకు తమ బిడ్డల కోసం వేచి ఉన్నారు. జిల్లా హైపవర్ కమిటీ నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లు పరీక్షల తీరును పరిశీలించారు. మొదటి రోజు నియోజకవర్గంలో ఎటువంటి మాస్ కాపీయింగ్, డీబార్‌లు లేవని పరీక్షల పర్యవేక్షణ అధికారులు తెలిపారు.


పామర్రులో పరీక్ష గది చూసుకుంటున్న విద్యార్థులు


మొవ్వలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థినులు


గుడివాడలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

యుద్ధప్రాతిపదికన సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలి

ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్


పామర్రు తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీఓ విజయ్‌కుమార్

పామర్రు: రీ సర్వే పనులు పూర్తి అయిన గ్రామాల్లో సర్వే రాళ్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయించాలని ఉయ్యూరు ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్లు, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులతో రీ సర్వేపై బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. 120 ఏళ్ల నాటి సర్వే రికార్డులు ఆధారంగానే ఇప్పటికీ పనులు జరగడంతో ఎన్నో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని గుర్తించిన ప్రభుత్వం భూ సర్వేలను చేపట్టిందన్నారు. భూ రికార్డులు, హక్కులు విషయాల్లో చోటుచేసుకుంటున్న అవకతవకలకు చెక్ పెట్టేందుకు రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. అత్యాధునిక టెక్నాలజీ సహాయంతో ఈ సమగ్ర భూముల సర్వే జరుగుతుందన్నారు. 100 శాతం కచ్చితత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.

పటిష్ట ఏర్పాట్లతో సర్వే పనులు

భూముల రీ సర్వే కోసం అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోందని ఆర్డీఓ విజయ్‌కుమార్ చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వే సెటిల్‌మెంట్ విభాగాల అధికారులు సర్వే సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఆధునిక సర్వే యంత్రాలతో సర్వే చేపడుతున్నామన్నారు. ప్రతి గ్రామానికి ఇద్దరు సర్వేయర్లు, వీఆర్వోతో బృందం ఏర్పాటు చేసి సర్వేలు నిర్వహించామని చెప్పారు. ఈ సర్వే సజావుగా సాగేందుకు తొలుత భూ రికార్డుల స్వచ్ఛీకరణ వీఆర్వో బృందంతో చేపట్టామన్నారు. డీజీపీఎస్, ఈటీఎస్, డ్రోన్ సర్వే ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కార్యక్రమం నిర్వహించామన్నారు.

9 గ్రామాల్లో రీ సర్వే పూర్తి..

తొలుత రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను ప్రక్షాళన చేశామని ఆర్డీఓ తెలిపారు. దాని ప్రకారం సర్వే నిర్వహించి రైతుల భూముల సరిహద్దులను నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు ఉన్న సర్వే నంబర్ల స్థానంలో లాండ్ పార్శిల్ నంబరు వస్తుందన్నారు. అలాగే 14 అంకెలతో కూడి గుర్తింపు కార్డును భూమికి ఇచ్చామని చెప్పారు. ప్రతి రైతుకు తమ భూములకు సంబంధించి సరిహద్దు రాళ్లు ఉంటాయని, ఈ రాళ్లను ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందజేస్తుందన్నారు. మండల పరిధిలో రీ సర్వే పనులు పూర్తి అయిన 9 గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన సర్వేరాళ్లను పాతించాలని చెప్పారు. మండలంలో ఇంకా రీ సర్వే పూర్తి కాని పామర్రు, పెదమద్దాలి, పసుమర్రు, కురుమద్దాలి గ్రామాల్లో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, మండల రీ సర్వేయర్ డీఐ సాయిబాబు, డీటీ నాగమల్లేశ్వరరావు, ఆర్‌ఐ అనిల్, సిబ్బంది శ్రీనివాసరావు, రాము, సచివాలయ సర్వేయర్లు, గ్రామాల సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

మొవ్వ జెడ్పీ పాఠశాలకు కంప్యూటర్ వితరణ


కంప్యూటర్‌ను అందజేస్తున్న మండవ కోటేశ్వరరావు తదితరులు

మొవ్వ: చదువుకున్న పాఠశాలకు అండగా ఉంటూ నేటి విద్యార్థుల ఉన్నతికై ఉపకరణాలు అందించటం హర్షించదగ్గ విషయమని హెచ్ఎం ఎన్వీ శ్రీధర్ పేర్కొన్నారు. మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని శ్రీమండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు మండవ సుధాకర్ తన తండ్రి మండవ కోటేశ్వరరావు చేతుల మీదగా రూ.40 వేల విలువైన కంప్యూటర్‌ను వితరణగా అందచేశారు. దాతను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ వేమూరి అమ్మాణి, ఉపాధ్యాయులు వినీలా కుమారి, మేకా రాణి పాల్గొన్నారు.

క్రైస్తవులు సంఘటితం కావాలి


మాట్లాడుతున్న సాల్మన్ కొల్లాబత్తుల

పామర్రు: క్రైస్తవులు సంఘటితం కావాలని పామర్రు క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రెవరెండ్ సాల్మన్ కొల్లాబత్తుల సూచించారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో మండల పాస్టర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రతి మండల కేంద్రంలో క్రైస్తవులకు ప్రత్యేక శ్మశాన వాటికలను ఏర్పాటు చేయడంతో పాటు క్రైస్తవ విద్యార్థులకు 4 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కె.సాల్మన్‌రాజు, టి.షాలేము రాజు, వైఎస్ సంగీతరావు, ఎం.మేషీ, సామ్యూల్ ప్రామిస్, ఎం.చంటిబాబు, ప్రసాదరావు, ఆదాం పాల్గొన్నారు.

ఓడీఎఫ్ గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన


గూడపాడులో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మొవ్వ: మొవ్వ మండలంలో నూరు శాతం ఓడీఎఫ్(ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) గ్రామాలుగా గుర్తింపు పొందిన గూడపాడు, వేములమడ, నిడుమోలు గ్రామాలను బుధవారం కేంద్ర బృందం(స్వచ్ఛభారత్ మిషన్) పరిశీలించింది. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను, చెత్త సేకరణ కేంద్రాలను, ఎలిమెంటరీ పాఠశాలలను, జిల్లా పరిషత్, పంచాయితీ కార్యాలయాల్లోని మరుగుదొడ్ల వినియోగాన్ని బృందం పరిశీలించింది. అలాగే ఆయా గ్రామాల్లో కుటుంబాలు మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా.. లేదా..? అనే అంశాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. పచ్చదనం, పరిశుభ్రత, డ్రైనేజీ వ్యవస్థ తదితర అంశాలపై, బహిరంగ మలవిసర్జన వలన వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఈఓపీఆర్డీ వీర్ల సీతారామరాజు, సర్పంచ్‌లు తాతా ఉగాది లక్ష్మి(గూడపాడు), వి.సీతారామయ్య(వేములమడ), కొమరగిరి అంజలి(నిడుమోలు) ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి కేంద్రాల ద్వారా పార్టీ వ్యాప్తి


మాట్లాడుతున్న సోము వీర్రాజు

గుడివాడటౌన్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ వ్యాప్తికి క్షేత్ర స్థాయి నుంచి కృషి చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. స్థానిక జగన్నాథపురంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ బూత్ కమిటీల జిల్లా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పాదయాత్రలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ సహాయం ఎంతో ఉందన్నారు. పార్టీ పటిష్టతకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్, తెలుగుదేశంతో కలిసి ఎన్నికలకు వెళతామని అనలేదని సోము వీర్రాజు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామినేని వెంకట కృష్ణ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కోలాటంలో శిక్షణ

గూడూరు: కళారంగానికి నిలయమైన కప్పలదొడ్డిలో కోలాటం, భజన, నృత్య ప్రదర్శనల్లో యువతీ యువకులకు శిక్షణ ఇస్తున్నామని సాంస్కృతిక శిక్షకులు పేరిశెట్టి ఉమాకాంతం తెలిపారు. కప్పలదొడ్డి గ్రామంలో కళారంగంపై ఆసక్తి ఉన్న యువతీ, యువకులను ఎంపిక చేసి కోలాటం భజన యూనిట్‌కు డ్రెస్ కోడ్‌ను, కాలి గజ్జెలను దాతల సహకారంతో సమకూర్చుతున్నామని చెప్పారు.